సాక్షి
సిద్దిపేట
మంగళవారం, 2, జనవరి, 2024



నీటిపై తేలియాడే వంతెనపై జనం

# కోమటిచెరువుపై కొత్త సంబురం

జిల్లా కేంద్రంలోని కోమటిచెరువుపై న్యూ జోష్ నెలకొంది. కొత్త ఏడాది సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు జనసందడితో మినీ ట్యాంక్ బండ్ కిటకిటలాడింది. ఈ సందర్భంగా మున్సిపల్, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కోమటిచెరువును పూర్తిగా విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. చిన్న, పెద్ద, తేడా లేకుండా చెరువు కట్టపై సందడి చేశారు. బోటింగ్, నెక్లెస్ రోడ్, జురాసిక్ పార్క్ సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. న్యూ ఇయర్ వేడుకలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. -సిద్దిపేటజోన్



కోమటిచెరువు (మినీ ట్యాంక్ బండ్)పై ప్రజలు



డైనోసార్ వద్ద యువతుల కేరింతలు



కోమటి చెరువు కట్టపై జనసమూహం

## న్యూస్‌రీల్

### సీఎంను కలిసిన శ్రీకాంత్‌రావు



సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న శ్రీకాంత్‌రావు

**గజ్వేల్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం సచివాలయంలో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



గవర్నర్‌కు మొక్క అందజేస్తూ శుభాకాంక్షలు చెబుతున్న బాలల సంక్షేమ సమితి సభ్యులు

**గజ్వేల్‌రూరల్:** రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను బాలల సంక్షేమ సమితి సభ్యులు కలిశారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింహులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్‌లో తమిళిసైకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### శబరిమలైకి సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్ర చేపట్టిన అయ్యప్ప మాలధారులు

**గజ్వేల్‌రూరల్:** గజ్వేల్ నుంచి శబరిమలైకి అయ్యప్పస్వామి మాలధారులు సైకిల్‌యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణ నుంచి మాలధారులు ఎర్రవాడ యాదగిరిస్వామి, నంగునూరు నవీన్‌స్వామి సైకిల్‌యాత్ర ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గతంలో గజ్వేల్ నుంచి శబరిమలైకి పాదయాత్రగా అయ్యప్పస్వాములు వెళ్లేవారని, ఇప్పుడు ఇద్దరు స్వాములు సైకిల్‌యాత్ర చేపట్టారని గుర్తు చేశారు. అయ్యప్ప స్వామి కృప ప్రజలందరిపై ఉండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

### నెట్‌బాల్ పోటీల్లో కాంస్య పతకాలు



బహుమతి అందుకుంటున్న ఉమ్మడి మెదక్ జిల్లా బాలికల జట్టు

**గజ్వేల్‌రూరల్:** రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు రెండు కాంస్య పతకాలు సాధించిందని నెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ తెలిపారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ గత నెల డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు మూడు రోజుల పాటు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీ జరిగినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు పాల్గొని అద్భుతమైన ఆటతీరును కనబర్చిందన్నారు. ఈ సందర్భంగా జరిగిన నెట్‌బాల్, ఫాస్ట్–5 నెట్‌బాల్ పోటీల్లో బాలికల జట్టు తమ సత్తా చాటి 2 కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు.

### కోడి పందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్టు

**రూ.15,900 నగదు స్వాధీనం**

**చేర్యాల(సిద్దిపేట):** పట్టణ శివారులో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.15,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ పట్టణకేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పట్టణశివారులో కొందరు వ్యక్తులు కోడి పందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు మెరుపుదాడి చేసి పట్టుకున్నామన్నారు. బండారి కృష్ణ, బండారి సురేశ్, గుంజి ఆంజనేయులు, గుంజి శివయ్య, గుంజి నాగేశ్వరరావు, తలారి బాలకృష్ణను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. మరి కొంతమంది పారిపోయినట్లు తెలిపారు.

# ప్లాస్టిక్ భూతం!

పర్యావరణానికి ప్లాస్టిక్ పెనుభూతంగా మారింది. ప్లాస్టిక్ కవర్ల నుంచి వాటితో చేసిన వస్తువుల విక్రయం, వినియోగానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు అందరి జీవితంలో ప్లాస్టిక్ భాగమైపోయింది. దీంతో ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ముప్పుగా మారింది. అన్నింటికీ ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ లేనిదే ఏ సరుకు తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. ప్లాస్టిక్‌పై నిషేధం విధించినా.. అధికారులు పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల పట్టణాలతో పాటు, 499 గ్రామ పంచాయతీలు ప్లాస్టిక్ మయమవుతున్నాయి.

**కానరాని నిషేధం**

- ఇష్టారాజ్యంగా వినియోగం
- విచ్చలవిడిగా కవర్ల విక్రయం
- సిద్దిపేటలో నాలుగు నెలల్లోనే వెలువడిన 1,702 క్వింటళ్ల ప్లాస్టిక్ వ్యర్థాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

| నెల | ఎంఎల్‌పీ (క్వింటాళ్లు) |
|---|---|
| సెప్టెంబర్ | 430.35 |
| అక్టోబర్ | 446.54 |
| నవంబర్ | 375.20 |
| డిసెంబర్ | 450.45 |

**సాక్షి, సిద్దిపేట:** జాతీయ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ చట్టం–2016 ప్రకారం 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను నిషేధించారు. వీటివల్ల పర్యావరణం దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో 50 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని కేంద్రం ఆదేశాలు జారీచేసింది. మొదట్లో కొంత కట్టుదిట్టంగా వ్యవహరించినప్పటికీ తర్వాత అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు.

**నాలుగు నెలల్లోనే 1702 క్వింటాళ్ల ప్లాస్టిక్**

సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తడి, పొడి,



హానికర చెత్తను ఇంటింటి నుంచి సేకరిస్తున్నారు. వారంలో మంగళ, శుక్ర వారాల్లో పొడి చెత్తను, సోమ, బుధ, గురు, శని వారాల్లో తడి, హానికరమైన చెత్తను సేకరిస్తున్నారు. నాలుగు నెలల్లో మొత్తం పొడి చెత్త 3,697క్వింటాళ్లు రాగా అందులో మల్టీలేయర్ ప్లాస్టిక్(ఎంఎల్‌పీ) 1,702.54 క్వింటాళ్లు, అలాగే మిల్క్ ప్యాకెట్ కవర్‌లు 50 క్వింటాళ్లు చెత్త బండికి పట్టణ ప్రజలు అందించారు. గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాలోనూ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని చెప్పినా ప్రజలు, వ్యాపారులు జోరుగా వినియోగిస్తున్నారు.

**ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం..**

ప్లాస్టిక్ సంచులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మున్సిపాలిటీల్లో



టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం అవి కొనసాగడం లేదు. ప్లాస్టిక్ నిషేధాన్ని సీరియస్‌గా తీసుకుని కొత్త సంవత్సరంలోనైనా అమలు చేయాలని పట్టణ, పల్లె వాసులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం**



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని గతంలోనే నిషేధించాం. కొన్ని రోజులుగా మన సిద్దిపేట పురపాలక సంఘం పరిసరాలలో నిషేధిత ప్లాస్టిక్ ను వాడుతున్నారని మా దృష్టికి వచ్చింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను అమ్మడం, అక్రమంగా నిల్వ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్ కవర్లను విక్రయించినా, హోటళ్లలో వినియోగించినా వారిపై జరిమానాలు విధిస్తాం.

– సంపత్ కుమార్, కమిషనర్, సిద్దిపేట పురపాలక సంఘం

# మల్లన్న కల్యాణానికి ఆహ్వానం



మల్లన్న కల్యాణ ఆహ్వాన పత్రికను మంత్రి పొన్నంకు అందిస్తున్న ఆలయ ఈవో బాలాజీ తదితరులు

**కొమురవెల్లి(సిద్దిపేట):** మల్లికార్జున స్వామి కల్యాణ ఆహ్వాన పత్రికను ఆలయ అధికారులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు హైదరాబాద్‌లో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

**మంత్రికి నోట్‌బుక్స్ అందజేత**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పూల బొకె బదులు నోట్ బుక్స్ అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజార్ మాలిక్, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకేకు బదులుగా నోట్ బుక్స్ అందించారు. మంత్రి పొన్నం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పూల బొకేల బధులుగా నోట్ బుక్‌లు తీసుకురావాలని సూచించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు గయజుద్దీన్, రాశాద్, అయ్యుబ్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

**మూలవిరాట్టు దర్శనం నిలిపివేత**

కొమురవెల్లి మల్లికార్జున స్వామి మూలవిరాట్టు దర్శనం సోమవారం సాయంత్రం నుంచి ఆలయ అధికారులు నిలిపివేశారు. మంగళవారం ఉదయం నుంచి ఉత్సవ విగ్రహాల దర్శనం అర్ధ మండపంలో కల్పించనున్నట్లు తెలిపారు. ఆలయ ఈవో బాలాజీ మాట్లాడుతూ ఈనెల7న స్వామి కల్యాణం నిర్వహించనుండటంతో గర్భగుడిలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు అలంకరణ చేసి ఆదివారం దిష్టికుంభం తర్వాత భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.



# విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

**శాస్త్రవేత్త, సామాజిక వేత్త ఎల్లారెడ్డి**

**నారాయణఖేడ్:** విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కామారెడ్డి జిల్లాకు చెందిన శాస్త్రవేత్త, సామాజికవేత్త పైడి ఎల్లారెడ్డి కోరారు. నారాయణఖేడ్ సరస్వతీ శిశు మందిర్‌లో సోమవారం మాతృ, పితృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. 2001లో తాను జపాన్‌లో పలు కంపెనీలు ఏర్పాటు చేశానని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే తపనతో స్వదేశానికి వచ్చి 2018 నుంచి కామారెడ్డి జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. పొరుగునే ఉన్న ఖేడ్ ప్రాంతంలోనూ అనేక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. శిశుమందిర్‌లో స్టేజీ నిర్మాణం కోసం సాయం అందిస్తానని, అంతేకాకుండా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజుదాస, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, పత్తిరి రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, సంజీవ్, నగేష్‌యాదవ్, వెంకటరమణారెడ్డి, నారాయణ తదిరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిని సన్మానిస్తున్న నారాయణ తదితరులు

# పత్తికి బోనస్ చెల్లించాలి

**సంగారెడ్డి టౌన్ :** పత్తి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఆయన రైతులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పేరుతో పత్తి రైతులను ఇబ్బంది పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పెట్టుబడి పెరిగినందున క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని తీర్మానించినట్లు చెప్పారు. అలాగే భారతీయ కిసాన్ సంఘ్ మూడేళ్లకోసారి చేసే సభ్యత్వం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సదానందరెడ్డి, కృష్ణారెడ్డి, దయా నందరెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

# ఆలయాల్లో నయా సందడి



నాచగిరిలో శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/వర్గల్:** ఆంగ్ల నూతన సంవత్సరానికి జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలికారు. సోమవారం జిల్లాలోని అన్ని ఆలయాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేటలో పలు ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు దైవదర్శనానికి బారులు తీరారు. తమ స్నేహితులకు, బంధువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని ఆలయాల్లో భక్తుల కోలాహలం కనిపించింది.

**నాచగిరికి పోటెత్తిన భక్తులు**

సుప్రసిద్ధ నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రం సోమవారం నూతన సంవత్సర శోభతో అలరారింది. పోటెత్తిన భక్తులతో కిటకిటలాడింది. ఓ వైపు ధనుర్మాసోత్సవాలు, మరోవైపు న్యూఇయర్‌తో భక్తుల తాకిడి పెరిగింది. ధనుర్మాసోత్సవాల సందర్భంగా తెల్లవారుజామునే స్వామివార్లకు అభిషేకం, అర్చనలు జరిపి విశేషాలంకృతులను చేశారు. న్యూఇయర్ తొలిరోజు శ్రీవారి దర్శనం కోసం భారీగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. క్షేత్రాన్ని 20 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు.



సిద్దిపేటలోని శ్రీ సాయిబాబా ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు

# ఆమోదం లభించేనా.. అభివృద్ధి జరిగేనా?

- పెండింగ్ ప్రతిపాదనలకు మోక్షం ఎప్పుడో?
- ముందుకు సాగని కీలక అంశాలు
- కొలిక్కిరాని సీసీరోడ్లు, వరద కాల్వలు..
- కొత్త ప్రభుత్వం స్పందనపైనే అందరి దృష్టి

**గజ్వేల్:** కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పెండింగ్ ప్రతిపాదనల అంశం తెరపైకి వస్తోంది. సీసీ రోడ్ల కోసం గతంలో రూ.120కోట్ల ప్రతిపాదనలు పంపితే కేవలం రూ.22.87కోట్లను మాత్రమే విడుదలయ్యాయి. వరద కాల్వల నిర్మాణం కోసం నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన రూ.15కోట్ల వ్యవహారం కూడా కొలిక్కరాలేదు. ఇవే కాదు మరెన్నో అంశాల్లో ముందడుగు పడటం లేదు.

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు సక్రమంగా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. 20వార్డుల్లో చాలావరకు కాలనీల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఏడాదిన్నర క్రితం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 80 కిలోమీటర్ల పొడవున సీసీ రోడ్లకు రూ.120 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదించారు. కేవలం రూ.22.87కోట్లు మాత్రమే ప్రభుత్వం విడదల చేసింది. దీంతో పనులు ముందుకు సాగడంలేదు.

**వరద కాల్వల ప్రతిపాదన సైతం..**

మున్సిపాలిటీ పరిధిలో వరద కాల్వల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఏళ్లతరబడి అతీగతీ లేకుండా పోయింది. పట్టణంలోని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రహదారి ఏటా వానాకాలంలో వరద ముప్పు తప్పడం లేదు. ప్రధానంగా ప్రజ్ఞాపూర్ ఊరచెరువు మత్తడి దుంకితే...ఆ నీరు వెళ్లడానికి అవసరమైన నాలాల వ్యవస్థ లేదు. నిజానికి ఈ వరద నీరు నాలాల ద్వారా రాజిరెడ్డిపల్లి కుంటలోకి అక్కడి నుంచి క్యాసారం చెరువులోకి వెళ్లాల్సి ఉంటుంది. కానీ నీరు వెళ్లే మార్గం లేకఅక్కడి నుంచి ఇళ్ల మధ్య నుంచే వరద నీరు కొట్టుకు వస్తోంది. ఇదే నీరు పార్థివేశ్వరస్వామి ఆలయం ఆర్చి వద్ద రోడ్డుపైకి వచ్చి జలమయంగా మారుతోంది. వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అండర్ డ్రైనేజీ గుండా వరద నీరు వేళ్లే విధంగా ప్రత్యేక నిర్మాణాలను చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం రూ.12.8కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదేవిధంగా ఎర్రకుంట నుంచి పాండవుల చెరువు ఫీడర్ చానెల్ నిర్మాణానికి మరో రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు ప్రతిపాదనలకు ఆమోదం వస్తేనే పట్టణంలో వరద ముప్పుకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. కానీ ప్రతిపాదనలకు ఏళ్ల తరబడి మోక్షం లేకపోవడం వల్ల ఏటా వరద కష్టాలు పరిపాటిగా మారాయి. దీంతోపాటుగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో రూ.49కోట్లతో చేపట్టాల్సిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల ప్రతిపాదన ముందుకుసాగడం లేదు.



మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీలో అధ్వానంగా అంతర్గత రోడ్డు

**పనుల్లోనూ నిర్లక్ష్యం**

మున్సిపాలిటీ పరిధిలో సుందరీకరించాలనుకున్న ఆరు జంక్షన్లలో కేవలం అంబేడ్కర్ చౌరస్తా, తూప్రాన్ రోడ్డు వై జంక్షన్, ముట్రాజ్‌పల్లి వద్ద మాత్రమే పనులు పూర్తి చేశారు. జాలిగామ బైపాస్ చౌరస్తా, ఇందిరాపార్కు చౌరస్తా, ఐఓసీ వద్ద చేపట్టాల్సిన పనులపై రెండేళ్లుగా నిర్లక్ష్యం నెలకొంది. రాజకీయ కారణాలతో ఈ పరిస్థితి నెలకొన్నదనే విమర్శలున్నాయి. కాగా పెండింగ్ ప్రతిపాదనలకు సంబంధించి కొత్త ప్రభుత్వం స్పందనపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. నిధులు విడుదల చేసి ఇబ్బందులు తీరుస్తారనే ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ అంశంపై గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళిని వివరణ కోరగా వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనని, ఆమోదం కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


మహేందర్‌తో పీఈటీ నరేశ్ కుమార్

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మండల పరిధిలోని కొల్గూరు గ్రామానికి చెందిన క్రీడాకారుడు జీ.మహేందర్ ఎంపికైనట్లు పీఈటీ నరేశ్ కుమార్ తెలిపారు. సోమవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో గతేడాది నవంబర్ 10 నుంచి 12 వరకు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు గుజరాత్‌లో జరుగనున్న జాతీయ స్థాయి అండర్-19 పోటీల్లో మహేందర్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

### అండర్ 14 క్రికెట్‌కు సిద్దిపేట క్రీడాకారులు


ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేటజోన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి హైదరాబాద్‌లో జరగనున్న అండర్-14 క్రికెట్ లీగ్ మ్యాచ్‌కు సిద్దిపేటకు చెందిన ముగ్గురు క్రీడాకారులకు అవకాశం దక్కింది. గత నెల 22,23,24, తేదీల్లో జరిగిన ఎంపిక ప్రక్రియ లో సిద్దిపేటకు చెందిన సాయి హర్షిత్, హర్ష దీప్, హర్షిత్ ప్రతిభ చాటారు. ఎమ్మెల్యే హరీశ్ రావు సిద్దిపేటలో ఏర్పాటు చేసిన క్రికెట్ స్టేడియం వసతితో సిద్దిపేట క్రీడాకారులకు అవకాశం వచ్చిందని సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జున్ పేర్కొన్నారు.

### జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ


కాంస్య పతకాన్ని సాధించిన ఆదిత్య

పటాన్‌చెరుటౌన్: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్ (సీఎస్‌బీఎస్) ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఆదిత్య జాతీయ పోటీలలో ప్రతిభ చాటి పతకాన్ని గెలుచుకున్నాడు. నవీ ముంబైలోని ఉరాన్‌లో ఇటీవల జరిగిన 44వ ఓపెన్ నేషనల్ డెడ్ లిఫ్ట్ చాంపియన్‌షిప్ లో కాంస్య పతకాన్ని సాధించారు. జాతీయస్థాయి పోటీల్లో అద్భుత విజయాన్ని అందుకున్న ఆదిత్యను గీతం ఉన్నతాధికారులు, క్రీడా శిక్షకులు, పలువురు అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

### మద్యం మత్తులో గడ్డి మందు తాగి..

- యువకుడు మృతి
- దొమ్మాట గ్రామంలో విషాదం


కుమార స్వామి (ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): మద్యం మత్తులో ఓ యువకుడు గడ్డి మందు తాగి మృతి చెందిన ఘటన దొమ్మాట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన ఈదన్నగారి శంకరయ్యకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. 15 ఏళ్ల కిందట శంకరయ్య దంపతులు ఇద్దరూ చనిపోయారు. ముగ్గురు కూతుళ్లకు, పెద్దకుమారుడు స్వామికి వివాహం అయ్యింది. చిన్న కుమారుడు కుమారస్వామి (24) వివాహం కాలేదు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ చెడు అలవాట్లకు బానిస అయ్యాడు. డిసెంబర్ 30న సాయంత్రం 6 గంటలకు మద్యం తాగి అదే మత్తులో గడ్డి మందు తాగి, అదే గ్రామానికి చెందిన స్నేహితుడు బాలిగారి ప్రవీణ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే ప్రవీణ్ కుమార స్వామి అన్న స్వామికి తెలుపగా సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. సోమవారం మృతుడి అన్న స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



# ఏకగ్రీవం.. ఏం లాభం?

- ఏకగ్రీవ పంచాయతీలను మరిచిన గత ప్రభుత్వం
- ప్రస్తుత ప్రభుత్వంపైనే సర్పంచ్‌ల ఆశలు
- ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షలు
- జిల్లాలో 97 ఏకగ్రీవ పంచాయతీలు

## పదవీకాలం ముగుస్తున్నా అందని నజరానా

గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఏక గ్రీవంగా ఎన్నికైతే ప్రోత్సాహక నిధులు వస్తాయని ఆశించిన ఏకగ్రీవ సర్పంచ్‌లకు నిరాశే ఎదురవుతోంది. నెలరోజుల్లో పదవీకాలం ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు డబ్బులు రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహక నిధులతో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకొని అభివృద్ధి చేసుకోవచ్చని భావించిన వారికి నిరాశే ఎదురవుతుంది. గత ప్రభుత్వంలోనే వస్తాయని అనుకున్నా రాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సహకాలు వస్తాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆశలు ఎదురుచూస్తున్నారు.

– మునిపల్లి(అందోల్)



గొర్రెగట్టు గ్రామ పంచాయతీ కార్యాలయం

ఏక గ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షలు నజరానా ఇస్తామన్న గత ప్రభుత్వ ప్రకటనకు పల్లెజనం స్పందించారు. గ్రామ పంచాయతీ ఏక గ్రీవమైతే ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలతోపాటు ప్రోత్సాహకం ఇస్తామని చెప్పిన విషయాన్ని ఆలోచించి జిల్లాలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే రూ.10 లక్షలతో గ్రామాభివృద్ధి చేసుకుందామని ఆశించారు. కానీ ఐదేళ్లు అవుతున్నా ఇంత వరకు నిధులు రాలేదు. ఏకగ్రీవమైన ఆరు నెలల్లోపే ప్రోత్సాహక నిధులు మంజూరు చేస్తామని గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పింది. సంబంధిత అధికారులు ఇప్పటికీ నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

### 97 గ్రామాలు ఏకగ్రీవం

సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీల్లో సుమారు 97 గ్రామాలను ఏకగ్రీవ పంచాయతీలుగా ప్రజలు ఎన్నుకున్నారు. ఏకగ్రీవం అయిన గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహకం అందిస్తామని చెప్పి మంజూరు చేయలేదు. గ్రామ పంచాయతీల్లో సమస్యలు పరిష్కారం కావాలంటే నిధులుండాలి. ఆదాయ మార్గం ఉంటే నిధుల కొరత ఉండదు. చిన్న గ్రామాల విషయానికొస్తే పరిస్థితి పూర్తిగా భిన్నం. జనాభా తక్కువగా ఉండడం, ఆదాయ వనరులు లేకపోవడం సమస్యగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు, జనాభా ప్రాతిపదికన ఇస్తుండడంతో ఈ గ్రామాలకు ప్రయోజనం చేకూరడం లేదు. కనీసం వీధి లైట్లు, తాగునీటి మోటార్లు విద్యుత్ బిల్లు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొంది. సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టేందుకు నిధులు లేక కాలం వెళ్లదీస్తున్నారు.

### ప్రతిపాదనలు పంపించాం



జిల్లాలో 647 గ్రామ పంచాయతీలకు గాను 97 పంచాయతీలు ఏక గ్రీవమయ్యాయి. 97 గ్రామ పంచాయతీలకు ప్రోత్సహకాలు మంజూరు కావాల్సి ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే అందజేస్తాం.

– సురేశ్ మోహన్, డీపీఓ


కేక్ కట్ చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్

## డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు


డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: నూతన సంవత్సరం సందర్భంగా సిద్దిపేట పట్టణంలో ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా, రంగదాంపల్లి చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తా, విక్టరీ చౌరస్తా, ముస్తాబాద్ చౌరస్తాతో పాటు పలు ప్రధాన చౌరస్తాల్లో తెల్లవారుజాము నాలుగు గంటల వరకు టెస్టులు నిర్వహించారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన పలువురు మందుబాబులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు నర్సింహరావు, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

## ప్రజలను మేల్కొలిపే రచనలు అవసరం

'రెప్ప వెనుక స్వప్నం' పుస్తకం ఆవిష్కరించిన గవర్నర్ తమిళిసై


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్, చిత్రాన్ని అందజేస్తున్న సుజాత

దుబ్బాకటౌన్ : దుబ్బాక మున్సిపాల్టీ పరిధిలోని లచ్చపేటకు చెందిన ప్రముఖ కవయిత్రి ఎర్రగుంట సుజాత ప్రసాద్ రచించిన 'రెప్ప వెనుక స్వప్నం' కథా సంపుటి పుస్తకాన్ని రాజ్‌భవన్‌లో సోమవారం రాత్రి గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రచయిత్రి సుజాత రచించిన రచనలు సమాజంలో ముఖ్యంగా మహిళలు, దీనస్థితిలో ఉన్న ప్రజల్లో చైతన్యం తెచ్చి మేల్కొలిపే విధంగా ఉన్నాయని ప్రత్యేకంగా ఆమెను అభినందించారు. ఇంకా తన కలం నుంచి ఆదర్శ సమాజం కోసం మరిన్ని పుస్తకాలు, రచనలు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సుజాత తన స్వహస్తాలతో చిత్రించిన గవర్నర్ చిత్రాన్ని ఆమెకు అందించారు.

# వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

సోమవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొని ములుగులో ఒకరు, ఆగి ఉన్న డీసీఎంను ఢీకొని రామాయంపేటలో మరొకరు మృతి చెందారు.


హరిప్రసాద్ మృతదేహం


మూడావత్ మోద్యా (ఫైల్)

ములుగు(గజ్వేల్) : బైక్‌పై అతివేగంగా వెళ్తూ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం వంటిమామిడిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌కు చెందిన పాషికంటి హరిప్రసాద్(30) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లిలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం మధ్యాహ్నం ఉద్యోగానికి వెళ్లాడు. సోమవారం ఉదయం డ్యూటీ ముగించుకొని గజ్వేల్‌కు వస్తున్నాడు. బైక్‌ను అతివేగంగా నడుపుతూ అదుపుతప్పి డివైడర్‌పై ఉన్న స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై హరిప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రామాయంపేట(మెదక్): రోడ్డు పక్కనే ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తొనిగండ్ల గ్రామశివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండలం గంగాపూర్ తండాకు చెందిన మూడావత్ మోద్యా (45) బైక్‌పై రామాయంపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. తొనిగండ్ల వద్ద రోడ్డు పక్కనే ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తాగిన మైకంలో దాడులు

ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన నారాయణ, రాజేష్

మనోహరాబాద్(తూప్రాన్): మద్యం తాగి కార్మికులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులో గల గ్లోబల్ అల్యూమినియం-2లో పని చేసే కార్మికులు రాజేశ్ (ఒరిస్సా), నారాయణ (శ్రీకాకుళం), కామరాజు మరికొంత మంది కలిసి కాళ్లకల్ వైన్స్ షాపు వద్ద మద్యం సేవించారు. అనంతరం గొడవ జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరిలో నారాయణ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

# 'ఉత్తమ' సేవలకు గుర్తింపు

- ఇద్దరికి ఉత్తమ సేవా పతకం
- నలుగురికి సేవా పతకాలు


వెంకట్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపాక మండలం సిర్సనగండ్లకు చెందిన నార్ల వెంకట్‌రెడ్డి 1998లో తొలుత దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. తర్వాత నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి పోలీస్‌స్టేషన్, సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్, సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్, తొగుట పోలీస్‌స్టేషన్‌తో పాటు గజ్వేల్ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఏడాది కాలంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకానికి ఎంపిక చేసింది.


తిరుపతిరెడ్డి

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తిరుపతిరెడ్డి ఉత్తమ సేవా పతకానికి ఎంపిక య్యారు. తిరుపతిరెడ్డి 1992లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. జిన్నారం పోలీస్ స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ రాగా ఆ తర్వాత రామాయంపేట, చేగుంట, సిద్దిపేట రూరల్, చిన్నకోడూరు, జగదేవ్‌పూర్, ప్రస్తుతం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. 2021లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు.


నాగేశ్వర్‌రావు

ములుగు(గజ్వేల్): ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఉప్పరి నాగేశ్వర్‌రావును ప్రతిష్టాత్మక పోలీస్ సేవా పతకం వరించింది. 1989లో ఆయన పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. 2012లో హెడ్‌కానిస్టేబుల్‌గా, 2017లో ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఆయన 19 నెలల నుంచి ములుగు ఏఎస్ఐగా సేవలందిస్తున్నారు. 34 ఏళ్ల సర్వీస్ రికార్డులో ఎలాంటి పొరపాట్లు లేకపోవడంతో ఆయన్ను పోలీస్ సేవా పతకం కోసం ప్రభుత్వం ఎంపిక చేసింది.

### సీసీఆర్‌బీ ఏసీపీ చంద్రశేఖర్‌కు..


ఏసీపీ చంద్రశేఖర్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని సీసీఆర్‌బీ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న పంతుల చంద్రశేఖర్‌కు ఉత్తమ సేవా పతకం, సిద్దిపేట సీఎస్‌బీలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎ.హనుమంతరెడ్డి సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 1995 బ్యాచ్ సివిల్ ఎస్ఐగా పోలీసు శాఖలో చేరిన చంద్రశేఖర్ ఉమ్మడి మెదక్ జిల్లాలోని జిన్నారం, సదాశివపేట, దుబ్బాకతోపాటు పలు పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహించారు. 2009లో సీఐగా పదోన్నతి పొంది హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బేగంపేట ట్రాఫిక్, బోయినపల్లిలో పని చేశారు. 2020లో ఏసీపీగా పదోన్నతి పొంది 2022, అక్టోబర్‌లో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లోని సీసీఆర్‌బీ విభాగంలో ఏసీపీగా సేవలందిస్తున్నారు.

### డీఎస్‌బీ ఎస్ఐకి..

సంగారెడ్డి : జిల్లాలోని డీఎస్‌బీలో పని చేస్తున్న ఎస్ఐ గుణుకుల యాదవరెడ్డికి ఉత్తమ సేవా పతకం లభించింది.

# మామను హత్య చేసిన అల్లుడు

మెదక్ పట్టణంలో దారుణం


ప్రభాకర్ మృతదేహం

మెదక్ మున్సిపాలిటీ: మేనమామను గొంతుకోసి అల్లుడు దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మెదక్ పట్టణంలోని రాంనగర్ వీధిలో సోమవారం వెలుగుచూసింది. పట్టణ ఎస్ఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. సిద్దేశ్‌గారి ప్రభాకర్(42) తన సోదరి యశోద రాంనగర్‌లో పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా ఇద్దరి మధ్య తరచూ ఆస్తి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి ప్రభాకర్ మద్యం సేవించి ఇంటికి వచ్చి సోదరితో గొడవపడ్డాడు. తల్లితో మామ గొడవ పెట్టుకోవడంపై ఆగ్రహానికి గురైన యశోద కుమారుడు ఏసుప్రభు (19) ప్రభాకర్ గొంతు కోసి హత్య చేశాడు. తల్లీకొడుకులైన యశోద, ఏసుప్రభులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సందర్శించాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

# ఖాళీ స్థలం.. దోమలకు నిలయం

జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో పెద్ద సంఖ్యలో ఉన్న ఖాళీ స్థలాలు వ్యాధులకు పుట్టినిల్లుగా మారాయి. జనావాసాల మధ్య కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఈ ఖాళీ స్థలాల నిర్వహణపై యజమానులు దృష్టి పెట్టకపోవడం ఇటు మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల పాలిట శాపంగా మారింది. ఈ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టి శుభ్రంగా ఉంచాల్సి ఉన్నా.. ఎక్కడా ఆ పరిస్థితులు కనిపించడం లేదు. కాలనీల్లో నివాసాల నడుమ మురుగుతో ఆయా ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్నాయి.

– సదాశివపేట(సంగారెడ్డి)

- దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా స్థలాలు
- పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు
- మురుగునీటి నిల్వతో ప్రజల ఇబ్బందులు
- మున్సిపల్ అధికారుల చర్యలు శూన్యం
- జిల్లాలో 8 మున్సిపాలిటీలు, 199 వార్డులు


సిద్దాపూర్ రోడ్డుకు ఆనుకొని ఉన్న కమల వెంచర్‌లో ఇళ్ల ఎదుట ఖాళీ స్థలంలో మురుగు నీరు

నివాసాల మధ్య ఖాళీ స్థలాలు చెత్తకుప్పలుగా తయారు అవుతున్నాయి. పరిసరాల్లో నివసిస్తున్న వారు నేరుగా ఖాళీ ప్రదేశాల్లో చెత్త పడేస్తుండడంతో పాటు చాలా ప్రాంతాల్లో మురుగు సైతం అందులోకి చేరుతోంది. మురుగునీరు నిల్వ ఉండకుండా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోకపోవడం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మున్సిపాలిటీల్లోని ఖాళీ స్థలాలను గుర్తించి ఆయా స్థలాలను ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవడంతో పాటు మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని నోటీసులు జారీ చేసేవారు. కొన్ని చోట్ల ఆయిల్ బాల్స్ వేస్తూ దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఆ చర్యలేవీ కనిపించడం లేదు.


### పన్నుల వసూలు పైనే శ్రద్ధ

జిల్లాలోని 8 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో జహీరాబాద్ 37, సదాశివపేట 26, నారాయణఖేడ్ 15, జోగిపేట 20, సంగారెడ్డి 38, బొల్లారం 22, అమీన్‌పూర్ 24, తెల్లాపూర్‌లో 17 వార్డులు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో ఇంటి, నీటి పన్నుతో పాటు గుర్తించిన ఖాళీ స్థలాలపై పన్నులు వసూలు చేస్తున్నారు. ఏటా ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి పన్నులు రాబడుతున్నారు. కొత్తగా వెలుస్తున్న లేఅవుట్లకు అసెస్మెంట్లు కేటాయించి డిమాండ్ నోటీసులు ఇస్తున్నారు. పన్ను వసూలుపై పెట్టిన శ్రద్ధ ఖాళీ స్థలాల శుభ్రంపై పెట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### 3,000 వరకు ఖాళీ స్థలాలు

జిల్లాలోని 8 మున్సిపాలిటీల పరిధిలో అధికారికంగా ఖాళీ స్థలాలు 1,500 నుంచి 3,000 వరకు జాబితాలో ఉన్నట్లు సమాచారం. జాబితాలో లేని ఖాళీ స్థలాలు ఎన్ని ఉన్నాయో అధికారులకే తెలియడం లేదు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డితోపాటు, జహీరాబాద్, సదాశివపేట, తెల్లాపూర్, అమీన్‌పూర్, నారాయణఖేడ్, జోగిపేట, బొల్లారం మున్సిపాలిటీల పరిధిలో అనధికారికంగా 2000 నుంచి 3000లకు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయని సమాచారం. ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి ఖాళీ స్థలాల చుట్టూ ప్రహరీలు నిర్మించేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### నోటీసులు జారీ చేస్తాం



సదాశివపేట మున్సిపల్ పరిధిలో అధికారికంగా 1,880లకు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. రోజురోజుకూ మున్సిపాలిటీలు విస్తరిస్తుండడంతో ఖాళీ స్థలాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్లాట్లు కొనుగోలు చేసిన వారు రిజిస్ట్రేషన్ కాగానే మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సమాచారం వస్తుంది. వాటిని వీఎల్‌టీ కింద గుర్తించి పన్నులు వేస్తున్నాం. 25 ఏళ్ల కిందట ప్లాట్లు కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకోలేని ఖాళీ స్థలాల యజమానులు ఎవరో గుర్తించడం కష్టతరంగా మారింది. కాలనీల వారీగా స్థలాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి
మున్సిపల్ కమిషనర్ సదాశివపేట

### నిబంధనలు నీళ్లపాలు..

మున్సిపాలిటీల్లో వ్యాధులకు కారణమయ్యే ఖాళీ స్థలాలను అధికారులు సిబ్బంది గుర్తించి ముందుగా యజమానులకు నోటీసులు జారీ చేయాలి. ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, ఎర్ర జెండాలు ఏర్పాటు చేయాలి. వాటిని చూసి యజమానులు శుభ్రం చేసుకుంటారు. అప్పటికీ స్పందించని యజమానులకు హెచ్చరికలు జారీ చేయాలి. ఖాళీ స్థలాలను మున్సిపల్ అవసరాలకు వాడుకునే విధంగా నిబంధనలు ఉన్నాయి. జిల్లాలోని సదాశివపేట, సంగారెడ్డి, జోగిపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ మున్సిపాలిటీల్లో నిబంధనలు అమలు కావడం లేదు.


సదాశివపేట పట్టణంలోని శ్రీసాయినగర్ కాలనీలో ఇళ్ల ఎదుట ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు నీరు